17 వ
నేటి దినపత్రిక సూర్య
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శనివారం,23 డిశంబర్ 2023

క్రిస్మస్ కానుకలు అందజేసిన 'కాపా'

నూజివీడు, మేజర్‌న్యూస్ : క్రిస్టియన్ సోదరులు క్రిస్మస్ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రావిచెర్ల గ్రామ సర్పంచ్ కాపా శ్రీనివాసరావు ఆకాంక్షించారు.ఏసుక్రీస్తు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని క్రిస్టియన్ సోదరులకు తొమ్మిది రకాల పచారీ సరకులతో కూడిన క్రిస్మస్ కానుకలను కాపా శ్రీనివాసరావు శుక్రవారం నాడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కానుకలు ఇచ్చే సంస్కృతిని నేటి ప్రభుత్వం మర్చిపోయిందని అన్నారు. నాడు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన కానుకలను మర్చిపోకుండా నేడు అందజేస్తున్నామని కాపా శ్రీనివాసరావు చెప్పారు. క్రిస్టియన్ సోదరా సోదరీమణులు ఎంతో ఆనందంగా క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని ప్రధాన లక్ష్యంతో ఈ కానుకలు అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. ముందుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు కాపా శ్రీనివాసరావు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మరియు శివ నాగమణి, మాజీ సర్పంచ్ ముల్లంగి రాజారావు, మాజీ ఎంపీటీసీ లావు ప్రసాద్, పార్టీ నాయకులు వలివేటి శ్రీనివాసరావు, ఖమ్మంపాటి సుబ్బారావు, మరీదు చెన్నకేశవరావు, వెనిగళ్ళ సాంబశివరావు, లావు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కసరత్తు ప్రారంభించిన కేంద్ర ఎన్నికల సంఘం

విజయవాడ/ఏలూరు, మేజర్ న్యూస్ :
ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కసరత్తును కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం విజయవాడలో ప్రారంభించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఏడుగురుఅధికారులబృందంరాష్ట్రానికి వచ్చింది.విజయవాడ లోని నోవాటెల్ హోటల్లో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించింది. జిల్లాల వారీగా ఓటర్ల జాబితా తయారీ తదితర అంశాలపై నివేదికల ఆధారంగా సమీక్షించారు.ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు నిర్వహించిన 2024 ఓటర్ల జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశంలో ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్ పాల్గొన్నారు.ఈ సమీక్షలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై ఈసీ బృందం సమీక్షించడం జరిగింది. జిల్లాలవారీగా ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, పి ప్రశాంతి ఎన్నికల కమిషన్ బృందానికి వివరించారు.

కలెక్టర్, ఎస్పీల పవర్ పాయింట్‌ప్రజంటేషన్ ...
సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ఆర్-2024, సాధారణ ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా.. ఎస్పీలు శాంతిభద్రతల అంశాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలు, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ ప్రక్రియ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, వారి ఫిర్యాదుల పరిష్కారం, వివిధ ఫారాల పరిష్కారం, ఇంటింటి సర్వే, అనామలీస్,ఫోటో, డెమోగ్రాఫిక్ సిమిలారిటీల పరిష్కారం,స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, డిస్పాచ్, రిసీట్,ట్రైనింగ్ సెంటర్లు, ఎన్నికల సిబ్బంది, శిక్షణతదితరాలను కలెక్టర్ వివరించారు. అదేవిధంగా జిల్లాల ఎస్పీ.. శాంతిభద్రతలపరిరక్షణ, గత ఎన్నికల నిర్వహణ సమయంలోఉల్లంఘనలకు సంబంధించి నమోదైనకేసుల విచారణ, అక్రమ మద్యం, డబ్బుతరలింపులను అడ్డుకునేందుకు తీసుకుంటున్నచర్యలు, చెకోపోస్టుల మ్యాపింగ్, సమస్యాత్మక,వల్నరబుల్ పోలింగ్ స్టేషన్లు తదితరాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

జగనన్నకు చెబుదాం
స్పందనలో 66 అర్జీలు

జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

ముదినేపల్లి, మేజర్‌న్యూస్ : జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన, నాణ్యమైన పరిష్కారం అర్జీదారులకు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి అధికారులను
ఆదేశించారు. శుక్రవారం ఏలూరు జిల్లా ముదినేపల్లి లోని " వి కన్వెన్షన్ " కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం జరిగింది.
ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, డిఆర్డిఏ పిడి డా. ఆర్. విజయరాజు, జిల్లా వ్యవసాయశాఖ జెడి వై. రామకృష్ణ, డిపిఓ టి. శ్రీనివాస విశ్వనాథ్, ఏలూరు ఆర్డిఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ వివిధ శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది సమన్వయంతో గ్రామాల్లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా వారి సమస్యలను సంతృప్తికరంగాను, నాణ్యతగాను ఉండేలాగా ఎండార్స్ మెంట్ ఇవ్వాలని దీనికి సంబంధించిన ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు రెవిన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు, సర్వే, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తడిసిన ధాన్యం కొనుగోలు, తదితరులకు సంబంధించి 66అర్జీలు వచ్చాయని జెసి తెలిపారు.

అందిన అర్జీలలో కొన్ని....ముదినేపల్లికి చెందిన లలితారాణి ఇంటి స్థలం ఇప్పించమని అర్జీ అందజేశారు. ముదినేపల్లి మండలం వాడవల్లి గ్రామానికి కి చెందిన రామారావు తమ గ్రామంలో ఉన్న చెరువు వెనుక రోడ్డుకు కరెంటు స్థంభం ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన దుర్గాబాబు తమ తల్లి ప్రమాదవశాత్తు కాలు విరిగిపోయిన కారణంగా వికలాంగుల పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు.కార్యక్రమంలో జెడ్పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ ఘంగా సంధ్య, ముదినేపల్లి తహశీల్దారు కె. శ్రీనివాస్, ఎంపిడిఓ పి. మల్లేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

300 మంది విద్యార్థులతో సామూహిక గీతా పారాయణం



ఏలూరు, మేజర్ న్యూస్: తపన ఫౌండేషన్ సహకారంతో హైందవి సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు దొండపాడు లోని శ్రీ నం దత్తానాథ క్షేత్రము వద్ద 300 మంది విద్యార్థులతో సామూహిక గీతా పారాయణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. తణుకు కు చెందిన త్యాగరాజు విద్యార్థులతో గీతా పారాయణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి మాట్లాడుతూ భగవద్గీతలోని 700 శ్లోకాలు నుండి యువతరానికి ఉపయోగపడే 100 ముఖ్యమైన శ్లోకాలతో ప్రత్యేకంగా ఇంగ్లీష్, తెలుగులో పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు ఇవ్వటం జరిగిందని, విద్యార్థులకు చదువు చాలా ముఖ్యమైందని, గురువులపైన గౌరవభావం, దేవుని పట్ల భక్తి భావం ఉంటే తప్పకుండా జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరని అన్నారు. విద్యార్థులు గీతా పారాయణం చేయటంతోపాటు శ్లోకాల అర్థం తెలుసుకొని జీవితంలో అనుసరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపరాజు వెంకటరామయ్య, హైందవి అశోక్, శ్రీమతి గారపాటి రేణుక, పెద్ద సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు,పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్నపువారి గూడెంలో తపన ఫౌండేషన్‌చే ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం

టి.నర్సాపురం,మేజర్ న్యూస్: మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు గ్రామీణ ప్రాంతాల్లో తపన ఫౌండేషన్ ద్వారా ఉచిత

కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మధ్యాహ్నపువారి గూడెం ఎంపిటిసి ఆళ్ళ ఈశ్వరి అన్నారు. శుక్రవారం టీ. నరసాపురం మండలం మధ్యాహ్నపువారి గూడెం గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఎంపీటీసీ ఆళ్ళ ఈశ్వరి ప్రారంభించారు. కుట్టు శిక్షణ పొందడం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఏర్పడుతుందని అని, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి చౌదరి సామాన్య కుటుంబంలో పుట్టి ఉన్నత స్థాయికి ఎదిగిన తన వంతు సమాజానికి సేవ చేయాలనే ఆలోచనతో 2008 నుండి తపన ఫౌండేషన్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, తమ గ్రామంలో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినందుకు ఆయనకి ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు. తపన ఫౌండేషన్ కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకొని అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని, 90 రోజులపాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని మండల తపన సేవా ప్రతినిధి శ్యాంసుందర్ అన్నారు.
ఈ కార్యక్రమంలో మధ్యాహ్నపు నాగార్జున, వరికుట్టి సత్యనారాయణ, తమ్మిశెట్టి వెంకట రామారావు, రెబ్బ లక్ష్మణరావు, ఆళ్ళ బాలాజీ, మాదాసు రామారావు, శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన సీఎం పర్యటన ఏర్పాట్లు

అధికారులకు జేసి రామ్ సుందర్ రెడ్డి ఆదేశం

భీమవరం,మేజర్‌న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి భీమవరం పర్యటనకు ముందస్తు ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదిను పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ముఖ్యమంత్రి భీమవరం పర్యటన ఏర్పాట్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ లూథరన్ హై స్కూల్ హెలిపాడ్ నుండి సభా ప్రాంతానికి సుమారు మూడు కిలోమీటర్లు దూరం ఉంటుందని, ముఖ్యమంత్రి ప్రయాణించే బస్సు మార్గంలో ఏ విధమైన ఆటంకాలు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హెలిప్యాడ్ నుండి సభాస్థలి వరకు సుందరీ కరణకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పార్కింగ్, హెలిపాడ్, సభాస్థలి వద్ద అంతర్గత రోడ్ల నిర్మాణాలు, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏ ప్రాంతాల్లో వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసింది ముందుగానే తెలిపే విధంగా రూట్ మ్యాప్ లను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సభా ప్రాంతానికి విచ్చేసే ప్రజల వాహనాలకు రోడ్డు మ్యాప్‌ను కూడా సిద్ధం చేయాలన్నారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి కృషిచేయాలని జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బిశివన్నారాయణ రెడ్డి, ఆర్డీవోలుకెశ్రీనివాసులురాజు, యంఅచ్యుత అంబరీష్,కె చెన్నయ్య, డీఎస్పీ బి.శ్రీనాథ్, జిల్లా పరిషత్ సీఈవో కెయస్ యస్ సుబ్బారావు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై కేసులు ఎత్తివేసినందుకు సీఎంకు ధన్యవాదాలు

ఏలూరు,మేజర్ న్యూస్ : రాష్ట్రంలోని వివిధ సంఘటనలకు సంబంధించి దళితులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సీఎం వైఎస్‌జగన్ మోహన్ రెడ్డి నవయుగ అంబేద్కర్ అని నేషనల్ దళిత్ జేఏసీ చైర్మన్‌పెరిగేకే వరప్రసాదరావు అన్నారు.ఈ మేరకు ఆయన శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి దళితులపై పెట్టిన కేసులు ఎత్తివేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబు నాయుడు మాదిగల పైన, మాలలపైన పెట్టిన కేసులను ఎత్తివేస్తూ వైసిపి ప్రభుత్వం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్రంలో దళితులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో ఎస్సీ లందరూ సీఎం జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలుగా ఉంటారని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికే వరప్రసాదరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగాముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి 'నవరత్నాల రథసారథి' మెమొంటోని అందజేసినట్లు తెలిపారు. 2024లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ బహుజనులు మళ్లీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ని సీఎంగా చేయ డానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో పేదలకు విద్య,ఇళ్ల పట్టాలు ఏంటి ఎన్నో సంక్షేమ పథకాలను అడ్డుకున్న చంద్రబాబు అంతం బహుజనుల పంతం అనే ధ్యేయంతో రాష్ట్రంలో బహుజనులు పని చేస్తున్నారని వివరించారు.ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ లందరూ దళితులపై పెట్టిన అక్రమ కేసులు అంశం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చిన రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితకి, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున,ఎంపీ సురేష్‌కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పెరికే వరప్రసాదరావు వెల్లడించారు.

అత్యంత వైభవముగా శ్రీవారి క్షేత్రంలో గిరిప్రదక్షిణ

ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్: పవిత్ర పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు గిరి ప్రదక్షణ అంగరంగ వైభవముగా చిత్రవిచిత్ర వేషాలతో నిర్వహించారు.తొలిత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం ప్రచార రథంని ఆలయ తొలి మెట్టు వద్ద ప్రధాన కూడలి ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఫౌండర్ ట్రస్ట్ నివృతరావు ఆలయ ఈవో వేంద్ర త్రినాధరావు టెంకాయలు కొట్టి జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభించారు. గజలక్ష్మి, అశ్వము, గోమాతలు, కేరళ నృత్యాలు,మేళ తాళాలు, చిత్రవిచిత్ర వేషాలతో గోవింద స్వాములు గోవింద నామాలతో గిరిప్రదక్షిణ అత్యంత వైభవముగా నిర్వహించారు. మార్గము మధ్యలో ఉచిత మంచినీరు పండ్లు దేవస్థానం వారు ఏర్పాటు చేశారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం సిబ్బంది పర్యవేక్షించారు. వేలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామి వారి నిజరూప దర్శనం చేసుకున్నారు.

త్యాగం,దయ, శాంతికి ప్రతీక క్రిస్మస్ డిపిఆర్ఓ టి.నాగేశ్వరరావు

భీమవరం, మేజర్ న్యూస్: త్యాగం, దయ, శాంతి వంటి గుణాలు ఇతరుల పట్ల కలిగి జీవించడమే నిజమైన క్రిస్మస్ అని, ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఈ క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని జిల్లా పౌర సంబంధాల అధికారి టి. నాగేశ్వరరావు ఆకాంక్షించారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా సమాచార శాఖ కార్యాలయం నందు సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డి.పి.ఆర్.ఓ టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ చాలా ప్రత్యేకమైనదని ఏ మతమైనా విశ్వశాంతినే భోధిస్తుందన్నారు. త్యాగం, దయ, శాంతి వంటి గుణాలు ఇతరుల పట్ల కలిగి జీవించడమే నిజమైన క్రిస్మస్ సందేశంమని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ వివిధ పనుల ఒత్తిళ్లతో కూడుకుని జీవిస్తున్నారని, అందరినీ కలుపుకొని ఒక సమాజంగా ఏర్పరచడంలో ఇటువంటి పర్వదినాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. దేవుని పట్ల విశ్వాసం ఉంచడం చాలా అవసరమని ఇదే మనలను నిత్యం నడిపిస్తుందని తెలిపారు. జీసస్ క్రైస్ట్ ప్రవచించిన ప్రేమ, దయ, సేవా గుణాలతో సమాజం శాంతి సౌఖ్యాలతో వెల్లివిరియాలని డిపిఆర్ఓ ఆకాంక్షించారు.ఈ వేడుకలలో ఎఇఐఇ యన్.వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ కెటియంకె సత్యనారాయణ రాజు, పబ్లిసిటీ అసిస్టెంటు చించిలి శ్రీనివాస నెహ్రూ, టైపిస్ట్ కె.జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ పి.యన్ రవితేజ, సిబ్బంది దేవరకొండ సోమరాజు, రెడ్డి వైశాలి, పి.వీర భద్రం,జె రాజేష్ బాబు, పి.వై రత్నాకర్, టి.రవితేజ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ప్రభుత్వ విప్ ముదునూరి

నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్: ఏసుక్రీస్తు బోధనలు శిరోధార్యయంగా భావించాలనిరాష్ట్ర ప్రభుత్వ చీఫ్ వి ప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మణే శ్వరంలో జరిగిన క్రిస్టమస్ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వంగలపూడి జకరయ్య అధ్యక్షత వహించారు. కన్వీనర్ గా డాక్టర్ గోగులమండ సుగుణ రావు వ్యవహరించారు. ఈ సభలో ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవ సోదరులు క్రిస్టమస్ పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు అని అన్నారు. పాస్టర్ జాన్ హాజరయ్య దైవ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోగుల మండ సుధీర్ బాబు, రిటైర్డ్ ఆర్డిఓఎస్ కడలయ్య, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు అండ్ రాజు చల్లారావు, జై మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన తెలుగుదేశం పార్టీ ధ్యేయం

రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు

కలిదిండి,మేజర్న్యూస్: పేదరిక నిర్మూలన తెలుగుదేశం పార్టీ ధ్యేయమని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు . కలిదిండి మండలం పెదలంక పంచాయతీ పల్లెపాలెంలో "బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ "కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచి తెలుగుదేశం పార్టీ జనసేన కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు .ఈ సందర్భంగా అంద్రాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే "పూర్ టు రీచ్" పథకం ద్వారా సంపద సృష్టించి రాష్ట్రంలో దారిద్ర రేఖకు దిగువన నివసిస్తున్న ప్రజలందరినీ సంపన్నులు చేయడమే ధ్యేయమని తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలందరూ మద్దతు ఇచ్చి నారా చంద్రబాబునాయుడు ని ముఖ్యమంత్రి చేసుకుందామని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ చక్రవర్తి. బూత్ కన్వీనర్ కొల్లాటి కొత్త రాజు. తెలుగుదేశం పార్టీ నాయకులు కొల్లాటి సత్యనారాయణ(జగన్నాథం) పంచాయతీ వార్డు మెంబర్ కొల్లాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేముల దీవిలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్: మండలంలోని వేములదీవి కాపుల కొడప జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అగ్నికుల క్షత్రియ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ తిరుమణి నాగరాజు హాజరయ్యారు. 71 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బొక్క రాధాకృష్ణ, వైస్ ఎంపీపీఉంగరాల రమేష్ నాయుడు, ఎంపిటిసి మైల వీర్రాజు, స్కూల్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, వైసీపీ అధ్యక్షులు శ్రీనివాస్, కాండ్రేకుల నరసింహారావుతదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు

నర్సాపురం, మేజర్న్యూస్ :రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె 11 వ రోజుకు చేరుకున్నది.దీనిలో భాగంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ స్థానిక అంబేద్కర్ సెంటర్ లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా సి ఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు కళ్యాణి దీక్ష శిబిరం వద్దకు వచ్చి సంఘభావం తెలిపి ప్రసంగించారు.ఆమె మాట్లాడుతూ గత 11 రోజుల నుంచి అంగన్వాడీ ఉద్యోగులు విధులు బహిష్కరించి మా న్యాయమైన కోరికలు పరిష్కరించాలని ఉద్యమం చేపడితే కనీసం ప్రభుత్వానికి వాళ్లని పిలిచి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని సోయలేదన్నారు.వారి సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికలలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికితగిన మూల్యం తప్పదు అన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు వేసి ఉద్యమంలో పాల్గొంటే ప్రభుత్వ అధికారులు సచివాలయం సిబ్బందిను ఉపయోగించుకుని తాళాలు పగలగొట్టి కేంద్రాలుతెరవడం హేయమైన చర్యఅనిఆవేదన వ్యక్తంచేశారు. మా న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి త్రిమూర్తులు మాట్లాడుతూప్రస్తుత ముఖ్యమంత్రి అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా జీతం ఇస్తానని వారి న్యాయమైన కోరికలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి ఇచ్చిన మాట తప్పి అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.తక్షణ అంగన్వాడీలకు

తెలంగాణ కన్నా అదనంగా జీతం గ్రాడ్యుయేట్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్వాడీ పిల్లలకు అందించే మెనూ పెంచాలని డిమాండ్ చేశారు.న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా నాయకురాలు ఏ రాణి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తలగం శెట్టి సత్యనారాయణ, అంగన్వాడి నాయకులు జై శ్రీలక్ష్మి, రజిని,నిర్మలకుమారి జిరాజేశ్వరి,జి వెంకటలక్ష్మి, జి. విజయలక్ష్మి బినాగలక్ష్మి,ప్రేమకుమారి,రాజేశ్వరి, రత్నకుమారి,ఏ నీలిమ,కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

24వ తేదీన ఆడుదాం.. ఆంధ్ర 3కె రన్

ఉత్సాహవంతులైన వారందరూ పాల్గొనాలి
జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు, మేజర్ న్యూస్:ఆడుదాం..ఆంధ్ర టోర్నమెంట్ లో భాగంగా ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం 6.30 గంటలకు ఏలూరులో ఆడుదాం..ఆంధ్ర 3కె రన్ నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఆదివారం ఉదయ 6.30 గంటలకు వట్లూరు సర్. సిఆర్ రెడ్డి మహిళా కళాశాల సమీపంలోని హెచ్ డిఎఫ్‌సి బ్యాంకు నుండి ఇండోర్ స్టేడియం వరకు 3కె రన్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు,ఉత్సాహవంతులు,జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆడుదాం.. ఆంధ్ర 3కె రన్ ను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు

మానవహారం నిర్వహించిన అంగన్వాడీలు

ద్వారకాతిరుమల, మేజర్న్యూస్: అంగన్వాడీలకు నాలుగున్నర సంవత్సరాల తర్వాత కూడా ఇచ్చిన హామీలు అమలు చేయలేమని చెప్పడం సిగ్గుచేటని సిఐటియు జిల్లా కార్యదర్శి లింగరాజు ఆరోపించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన నిరాహార దీక్ష లు శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకున్నాయి ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ కూడా మానవహారంగా ఏర్పడి అంగన్వాడీలు తన నిరసన తెలియజేశారు.

రైతుల సంక్షేమం కోసం మరిన్ని ప్రణాళికలు

భీమడోలు, మేజర్ న్యూస్ : భీమడోలు రైతు సేవా సహకార సంఘం. రైతుల సంక్షేమ దృష్టిలో ఉంచుకొని మరిన్ని సేవలను అందజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందని సంఘం అధ్యక్షులు రావిపాటి సత్య శ్రీనివాస్, ఎండి. ఆర్. రాంబాబు తెలిపారు. సంఘం ప్రగతి గురించి వివరిస్తూ 4,200సభ్యత్వాలు, రెండు కోట్ల రూపాయల ఫిక్స్ డిపాజిట్లుతో సంఘ నిర్వహణ జరుగుతుందన్నారు. సన్న,చిన్న కారు రైతులకు 20 కోట్ల రూపాయల వరకు రుణాల అందజేశామన్నారు మల్టీపర్పస్ క్యాష్ అండ్ క్రెడిట్ లోన్ కింద రెండు కోట్ల రూపాయల వరకు అందజేశామన్నారు. లాభనష్టాలతో నిమిత్తం లేకుండా సంఘం ద్వారా ధాన్యం సేకరణ కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు చెల్లించవలసి అన్ని మొత్తాలను చెల్లించామని తెలియజేశారు లాంగ్ టర్మ్ రుణాల కింద ఏడు కోట్ల రూపాయల వరకు పంపిణీ చేశామన్నారు. పంట రుణాలుగా ఎకరం విస్తీర్ణంలో వరికి లక్ష రూపాయలు , ఆక్వాకు రూ. 8 లక్షలు వరకు అందజేస్తున్నామన్నారు .సంఘంలో లాకర్ సదుపాయం ఉందని తెలిపారు .వ్యక్తిగతంగా గరిష్టంగా రూ. 40 లక్షల వరకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో రైతుల సంక్షేమ దృష్టిలో ఉంచుకొని సంఘము ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు, తక్కువ ధరకే నాణ్యమైన మందులు అందించేందుకు జన ఔషధ్ (జనరిక్)మందుల షాపును పెట్టే ప్రతిపాదనలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

ఎలక్షన్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌ని కలిసిన బివి రావు

కైకలూరు, మేజర్ న్యూస్: కైకలూరు నియోజకవర్గం జనసేన – తెలుగుదేశం పార్టీ సమన్వయ కర్త బీవీ రావు స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బాబ్జి ని, తాసిల్దార్ మురళీకృష్ణ ని కలిసి కైకలూరు పరిధిలోని నియోజకవర్గ ఓటర్ జాబితాలోని మార్పులు, చేర్పులు, తొలగింపుల వివరాలు అడిగి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన ఐ టి కోఆర్డినేటర్ కడియం శివ బాబు , యాదవ్ సంఘం వ్యవస్థాపక సభ్యులు నాగనబోయిన విజయకుమార్ , జనసేన నాయకులు కరేటి రామకృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి హామీ పత్రాలను అందిస్తున్న టిడిపి నాయకులు

కైకలూరు, మేజర్ న్యూస్: కైకలూరు మండలం వదర్లపాడు లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పెన్మేత్స త్రినాథ్ రాజు,క్లస్టర్ ఆగోల్లు భలే స్వామి ఆధ్వర్యంలో,తెలుగుదేశం పార్టీ – జనసేన పార్టీ పర్యవేక్షణలో 2024 లో టిడిపి–జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేయగానే మన కుటుంబానికి వర్తించే సంక్షేమ పథకాలు " బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ " ద్వారా హామీ పత్రాలను మహిళ లకు అందిస్తున్న ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు వీరమల్లు నరసింహారావు,వీరాబత్తిన సుధ,నియోజకవర్గ టిడిపి బి.సి సెల్ ఉపాధ్యక్షులు మారగాని మురళీకృష్ణ,బూత్ కన్వీనర్ విస్సాకోడేటి నాగ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

దత్తాశ్రమం నుండి వివిధ ఆలయాలకు శ్రీరామ పూజా అక్షతల పవిత్ర కలశాలు

ఏలూరు, మేజర్ న్యూస్: అక్షతల పవిత్ర కలశల స్పర్శ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి దంపతులు.శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏలూరు దొండపాడు శ్రీ దత్తాశ్రమంలో శ భక్తిశ్రద్ధలతో పవిత్ర శ్రీరామ జయ మహామంత్ర జపనామా స్పరణ మధ్య అయోధ్య నుండి వచ్చిన శ్రీరామపూజా అక్షతల పవిత్ర కలశ స్పర్శ కార్యక్రమం మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు.ఏలూరులోని వివిధ ఆలయాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆలయ కమిటీ సభ్యులతోపాటు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, రేణుక దంపతులు అక్షతల పవిత్ర కలశల స్పర్శ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏలూరు టౌన్ పరిధిలోని వివిధ ఆలయాల నుండి వచ్చిన ఆలయ కమిటీలకు శ్రీరాముని వారికి అభిషేకించిన అక్షతలతో ఉన్న పవిత్ర కలశలను అందజేయటం జరిగిందని, పవిత్ర అక్షతల కలశలను ఆయా ఆలయాల్లో భద్రపరిచి జనవరి ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రతి కుటుంబానికి పవిత్ర అక్షంతలు, శ్రీరామ మందిర నిర్మాణ నమూనా, విగ్రహ ప్రతిష్ట ఆహ్వాన పత్రికను కూడా అందించడం జరుగుతుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ చక్రధర్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మైలవరపు వెంకట లక్ష్మీనరసింహం,వివిధ ఆలయ కమిటీ సభ్యులు,పెద్ద సంఖ్యలో భక్తులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

కోవిడ్ విపత్తు ఎదుర్కొనేందుకు సిద్ధం

భీమడోలు ,మేజర్ న్యూస్:కోవిడ్ నేపథ్యంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో విపత్తును ఎదుర్కొనేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంసిద్ధత కార్యక్రమం చేపట్టినట్టు ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ సునీత తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయుష్మాన్ భవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య కేంద్రంలో పర్యవేక్షకులతో పాటు ,మత్తు వైద్య నిపుణులు డాక్టర్ అశ్విని గర్భిణీలను పరీక్షించారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ అవకాశంలో గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, అందుబాటులో గల ఆరోగ్య కేంద్రం సేవలను వినియోగించుకోవడం, వైద్యుల నిరంతర పర్యవేక్షణ, ఇతర అంశాల గురించి వివరించారు.

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అవసరం మేరకు కోవిడ్ చికిత్స కోసం అన్ని వసతులతో కూడిన ఏడు పడకల ప్రత్యేక వార్డు సిద్ధం చేస్తున్నామన్నారు. దీనిలో మూడు పడకలను పిల్లలకు, నాలుగు పెద్దలకు ప్రత్యేకించిన్నట్టు తెలిపారు ఇదే క్రమంలో చికిత్స కోసం అవసరమైన వెంటిలేటర్లు, ఆక్సిజన్ నిల్వలు గల సిలిండర్లను సిద్ధం చేసుకోవడం , చికిత్స కు అవసరమైన మందులను సిద్ధం చేయటం, వైద్య సేవలు అందించేందుకు ప్రస్తుతం ఉన్న వైద్యులకు అదనంగా ఖాళీగా ఉన్న పోస్టులో మరొక వైద్యుని నియామకం చేయాలని కోరటం వంటి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్రజలు

కోవిడ్ విపత్తును సమర్థవంతంగా ఎదుర్కోవడం కోసం మాస్కులు ధరించటం ,భౌతిక దూరం పాటించడం ఇతర ఆరోగ్య అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

వారికి అవసరమైన అవగాహన కల్పించేందుకు ఆరోగ్య కేంద్రం సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇదేవిధంగా కోవిడ్ ప్రాథమిక నిర్ధారణకు అవసరమైన పరీక్షల నిర్వహణ కోసం ,దానికి కావాల్సిన అవసరాలను సమకూర్చేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావలసి ఉన్నది తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

భీమడోలు , మేజర్న్యూస్ : విద్యార్థులు కష్టపడి కాక ఇష్టపడి చదవడం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చునని స్వచ్ఛంద సంస్థ మానవత కు చెందిన కెరియర్ గైడెన్స్ జిల్లా కమిటీ చైర్మన్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి తెలిపారు భీమడోలు హైస్కూల్లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తు ప్రణాళిక తయారీపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒక్కొక్క మండలం నుంచి రెండు ఉన్నత పాఠశాలలను కార్యక్రమ నిర్వహణకు దత్తత తీసుకొన్న జిల్లా కమిటీ ఇప్పటికే పూళ్ళ హైస్కూల్లో కార్యక్రమాల్ని పూర్తిచేసుకొన్నారు.శుక్రవారం భీమడోలు హైస్కూల్లో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి మానవత జిల్లా కమిటీ సభ్యులు రామిశెట్టి గంగాధర రావు, కెరియర్ గైడెన్స్ కమిటీ జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, భీమడోలు శాఖ చైర్మన్ గుళ్ళ నూకరాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రాధా పుష్పవతి మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్ణయించుకోవడంతో పాటు దాని పట్ల స్పష్టత , దాన్ని సాధ్యం చేసుకోనేందుకు కొలమానం ,అది వాస్తవానికి దగ్గరగా ఉండటం ,వ్యక్తిగత స్థాయి ఆధారంగా లక్ష్య సాధన , వంటి కార్యక్రమాలను తయారు చేసుకోవాలన్నారు .దీనితో పాటు విద్యార్థులు సెల్లు నుంచి సిగరెట్ వరకు కల 8 .సి .అంశాల నుంచి దూరంగా ఉండాలని కోరారు .ఇదే క్రమంలో అధ్యయన నైపుణ్యం ,విద్య ఉద్యోగ అవకాశాల పట్ల అవగాహన ఇతర అంశాల గురించి తెలుసుకోవాలని కోరారు .అనంతరం విద్యలో ప్రతిభ కనబరిచిన పాఠశాలకు చెందిన ఆంగ్ల మాధ్యమం, తెలుగు మాధ్యమంలో చదువుకుంటున్న షబీనా ,రజిత ,లక్ష్మీ దివ్య, డి ప్రభాస్ ,దివ్యశ్రీ సాహితి ,దివ్య సాయి లకు సంస్థ తరపున , మెమెంటో , వారి విద్యా స్థాయి ఆధారంగా బంగారు ,రజత ,కాంస్య పతకాలు ,షీల్డు, పుస్తకాలను అతిథుల చేతులు మీదుగా అందజేశారు. విద్యార్థులను విద్యాపరంగా ప్రోత్సహించి సహకరిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాసరావు ను సత్కరించారు.

లెక్కల పట్ల ఆసక్తి పెంచేందుకు నూతన కార్యక్రమాలు

భీమడోలు , మేజర్ న్యూస్ : లెక్కలపట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంచేందుకు భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల స్థాయిలో నూతన కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ గణిత దినోత్సవ కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. తొలుత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించారు. గణితం కోసం ఆయన చేసిన కృషిని కరస్పాండెంట్ వివరించారు. ఆ తరువాత విద్యార్థులు గణితం అంశంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలు. పలువురిని ఆకట్టుకున్నాయి.

ఆదిత్యలో ఘనంగా ఆసరా,గణిత దినోత్సవం

తాడేపల్లిగూడెం,మేజర్న్యూస్: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల తాడేపల్లిగూడెంలోఅడ్వకేట్స్,అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఆసరా) ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం లీగల్ మెట్రాలజీ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే ప్రముఖ శాస్త్రవేత్తశ్రీనివాస్‌రామానుజన్ జన్మదినం పురస్కరించు కొని, జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు క్విజ్ పోస్టర్ ప్రెసెంటేషన్ మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పి. లక్ష్మీ సరోజ మాట్లాడుతూ దైనందిన జీవితంలో మాథ్స్ యొక్క ప్రాధాన్యత వాటి వినియోగం తెలియపరిచారు.

ఈ గణిత శాస్త్రవేత్త, ఇన్ఫినిటీని కనుగొని, అత్యంత కీలకమైన విషయాలను కనుగొన్నారని చెప్పారు. ఆయన కృషికి గుర్తుగా మనం ఈ రోజున డిసెంబర్ 22 న జాతీయ గణిత దినోత్సవం గా జరుపుకుంటున్నామని ఇది 2012లో మన్మోహన్ సింగ్ ప్రారంభించారని స్థానిక డైరెక్టరు కె.శ్రీనివాస్ రెడ్డి తెలియపరిచారు. గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆసరా పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొడాలి రమేషుబాబు, ప్రధానకార్యదర్శి బత్తులప్రసాద్, లీగల్ మెట్రాలజీ జిల్లా ఆఫీసర్ నాగరాజు, తాడేపల్లిగూడెం ఇన్స్పెక్టర్ అప్పల నాయుడు, ఆసరా కార్యవర్గ సభ్యులు ఆదిత్య శ్రీనివాసరెడ్డి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సరోజ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తమ్మిశెట్టి రంగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసు ప్రభు బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలి

ఏలూరు ఆర్‌సిఎం పీఠాధిపతి పాలిమేర జయరావు

ఏలూరు,మేజర్న్యూస్ : సమాజంలోని తోటివారిని ఆదరించి, ప్రేమించాలన్న యేసుప్రభువు బోధనలు ప్రతిఒక్కరూ అనుసరించాలని ఏలూరు కథోలిక పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పాలిమేర పిలుపునిచ్చారు. ఏలూరు గ్లేవియర్ నగర్ లోని బిషప్ హౌస్ ప్రాంగణంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ సోషల్ సర్వీస్ సెంటర్ లో డైరెక్టర్ పాధర్ తాతపూడి ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో బిషప్ జయరావు పాలిమేర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు పలువురు పాధర్లు, సిస్టర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల మధ్య సెమీ క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా బిషప్ పాలిమేర జయరావు మాట్లాడుతూ యేసుక్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో పయనిస్తూ తోటివారికి చేయూతనందించాలని సూచించారు. యేసు చూపిన దయ, ప్రేమ మార్గం ప్రతిఒక్కరికీ అనుసరణీయమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సేవా కేంద్రం అందిస్తున్న సేవలు అభినందనీయమని, నాలుగు జిల్లాల్లో అన్ని వర్గాల ప్రజలకు చేయూత అందిస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగను ప్రతిఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం భారీ క్రిస్మస్ కేక్ ను ఆయన కట్ చేశారు. కొవ్వొత్తులను వెలిగించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్ పాస్ లను అందజేశారు. అనంతరం బిషప్ జయరావు పాలిమేరను పలువురు పాధర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ పిడి డాక్టర్ ఆర్. విజయరాజు, మానవత స్వచ్ఛంధ సంస్థ రీజనల్ అధ్యక్షులు అడుసుమిల్లి నిర్మల, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్, డిసిపిఓ సూర్యచక్రవేణి, ఆడిటర్ రాధాకృష్ణ, కార్పొరేటర్ నిర్మల గ్లేవియర్, సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల కరస్పాండెంట్ పాధర్ జి.మోజెస్, ఛాన్స్ లర్ పాధర్ బాబు జార్జి, కేథడ్రల్ ఫ్యారీస్ పాధర్ మైఖేల్, పాధర్ జాకబ్, పాధర్ రాజు, సిస్టర్ లీలమ్మ, అబ్రహాం మాస్టర్, ఏఎంసీ డైరెక్టర్ జక్కుల బెనర్జీ, ఎలెక్స్, సోషల్ సర్వీస్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సూర్య కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

నరసాపురం,మేజర్‌న్యూస్ : పట్టణంలోని శ్రీ సూర్య కళాశాల సెమినార్ హాల్లో క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగింది. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యురాలు, అశ్విని హాస్పిటల్ డాక్టర్ ఎమ్. పద్మావతి విచ్చేసారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి,సెక్రటరీ యోగ టీచర్ అనసూయ,ట్రెజరర్ బొమ్మిడి సూర్య కుమారి సదస్సులో పాల్గొన్నారు.డాక్టర్ ఎమ్. పద్మావతి మాట్లాడుతూ క్యాన్సర్ అనుమానాలుంటే స్క్రీనింగ్ టెస్ట్ అందుబాటులో ఉందని, 10 నుండి 45 సంవత్సరాల వారికి వ్యాక్సిన్ వాడుకలోనికి వచ్చిందని తెలియజేశారు.క్యాన్సర్ బారినపడిన వారికి, బాధిత బంధువులకు జన్యుపరంగా సమస్యలు ఉంటే ప్రతి సంవత్సరం స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.క్యాన్సర్‌కు గల కారణాలు, నివారణ పద్ధతులు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలకు పరిష్కార మార్గాలను తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి మాట్లాడుతూ నరసాపురంలో పలు సామాజిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ప్రజలకు చేరువలో రోటరీ క్లబ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు.ఈ సదస్సులో పుర ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీల రాస్తారోకో

భీమడోలు, మేజర్ న్యూస్ : అంగన్వాడీలు భీమడోలు మండల స్థాయిలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో 11వ రోజుకు చేరింది. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీలు భీమడోలు జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు. భీమడోలు సాయిబాబా గుడి వద్ద అంగన్వాడీలు ఏర్పాటుచేసిన శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు సందర్శించి ,ప్రసంగించారు. ఆ తర్వాత అంగన్వాడీలతో కలిసి అక్కడ నుంచి భీమడోలు జంక్షన్ చేరుకున్నారు అంగన్వాడీలు చేపట్టిన రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి యూనియన్ నాయకులు స్వర్ణ కుమారి ,చెల్లామణి నాయకత్వం వహించారు

500 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణి చేసిన ఎమ్మెల్యే ప్రతాప్



ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నూజివీడు శాసనసభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థినీ, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ మాట్లాడుతూ రూ. 17,500 ట్యాబ్ లలో, 15,500 విలవైన బైజూస్ కంటెంట్ వేసి ఇస్తున్నాం, దీంతో ప్రతి విద్యార్థికి రూ. 33,000 లబ్ది చేకూరినట్లు అవుతుందని అన్నారు.ప్రతి పిల్లాడికి పాఠాలు సులభంగా అర్థమయ్యేలా ఈ ట్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయనిస్పష్టం చేశారు.ట్యాబ్‌లలో చదువుకు సంబంధించిన అంశాలే ఉంటాయని ,ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎనిమిదో తరగతి విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్స్ పంపిణీ చేపట్టిందని,పేదింటి పిల్లలు అంతర్జాతీయ వేదికపై తమ సత్తాచాటాలన్న సీఎం జగన్ లక్ష్యంమని ఎమ్మెల్యే ప్రతాప్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ పల్లగాని నరసింహారావు, ఎంపీపీ గోళ్ళ అనూష ఇస్సాకు, జడ్పిసి పిన్ని బోయిన వీరబాబు,వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు టీ.పావని జ్యోతి, జిల్లా కార్యదర్శి మచ్చ హరిబాబు, ఎంపీడీవో పి శంకర్రావు, ఎంఈవోలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్ప లత, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పలగాని రాంబాబు, సోషల్ మీడియా కన్వీనర్ వాకసకేశ్వరావు, తదితర వైసిపి నాయకులు కార్యకర్తలు, మరియు పాఠశాల ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక అలంకరణలు

నర్సాపురం, మేజర్ న్యూస్ :శ్రీ ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామి వారి దేవస్థానము నందు ముక్కోటి ఏకాదశి కి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరుకానున్న దృష్ట్యా దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.ఆలయ కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుప్పాల ఆదినారాయణ పర్యవేక్షిస్తున్నారు.

ఓట్లేసి గెలిపించిన దళితులు పైనే కక్ష

పాలకొల్లు,మేజర్‌న్యూస్: వైసీపీ ప్రభుత్వానికి అత్యధిక ఓట్లు వేసిన దళితుల పైనే కక్ష అని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పెచ్చెట్టి వెంకట నరసింహారావు(బాబు) అలాగే పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వర రావు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తులా రామలింగేశ్వరరావు, 21 వ వార్డు మాజీ కౌన్సిలర్ పొట్నోరి శ్రీనివాస్ , అన్నారు. పాలకొల్లు పట్టణ 31,21 వ వార్డులో టిడిపి,, జనసేన ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం జగన్ ప్రభుత్వంలో దళితులకు రద్దు అయిన 27 సంక్షేమ పథకాలు, ఎస్సీ సబ్ ప్లాన్ నిర్వీర్యం వంటివి గడపగడపకు తీసుకువెళ్లే కార్యక్రమంలో పాల్గొన్నారు. టిడిపి జనసేన ఎస్సీ సెల్ నాయకులతో కలిసి ఆయనతోపాటు జనసేన నాయకులు ఇంటింటికి తిరిగారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ నాలుగున్నర సంవత్సరాలలో దళితులకు కొత్తగా సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా గత ముప్పై నలభై సంవత్సరాలు నుండి పొందుతున్న 27 పథకాలు రద్దయ్యయన్నారు. మరి ముఖ్యంగా దళిత ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన ఎస్సీ సబ్ ప్లాన్ ను నిర్వీర్యం చేసి ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదన్నారు. దళితులను ప్రభుత్వం ఏ విధంగా మోసం దగా చేసిందో చెప్పేందుకు దళిత పేటలు, వాడల్లోకి వెళుతుంటే దళిత బిడ్డలు ఎదురొచ్చి ఈ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రావ్ ల స్ఫూర్తితో రాబోయే టిడిపి జనసేన ప్రజా ప్రభుత్వం దళితుల సంక్షేమం అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని రెండు పార్టీలనాయకులుహామీఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చేట్టి వెంకట నరసింహారావు (బాబు) పాలకొల్లు పట్టణ అధ్యక్షులు గండిటి వెంకటేశ్వరరావు,పీతల శ్రీనివాస్, పొత్నూరి శ్రీనివాస్,తులా రామలింగేశ్వరరావు,రగుమండ వెంకట రమణ,చీకట్ల మహేష్, మట్టా చంద్రశేఖర్,రాపాక విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని పార్టీలు కలిసిన అంతిమ విజయం వైసిపిదే

ఎడ్ల తాతాజీ మాజీ డిసిఎంఎస్ చైర్మన్

పాలకొల్లు,మేజర్‌న్యూస్: పాలకొల్లు నియోజకవర్గంలో, రాష్ట్రంలో టిడిపి జనసేనతో కలిసిన ఓడిపోతామనే భయంతోఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం అంశం తెచ్చారని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ఆరోపించారు. ఆయనకార్యాలయంలోశుక్రవారంమీడియాసమావేశంలో మాటాడారు. పాలకొల్లులోఎస్సీసబ్‌ప్లాన్‌నిధులు ఏవిధంగా దుర్వినియోగం అయ్యాయి, ఈ నిధులు అడ్డు పెట్టుకొని పెద్దలు ఎవరి పొలాలకు రోడ్లు వేయించుకున్నారో త్వరలో చెబుతానని చెప్పారు. ఈ నిధులు రూ 25 లక్షలతో ఎవరు కారు కొనుగోలు చేసారో వివరాలు చెబుతానన్నారు. బలంగా ఉన్న వైసిపిని ఎదుర్కొనేందుకు 2 పార్టీల బలం సరిపోక ఇప్పుడుబిజెపినికలుపుకొనేందుకు తహతహ లాడుతున్నారు అనిఅన్నారు,ఎన్ని పార్టీలు కలిసిన వైసిపి పార్టీ బలం ఎప్పటిలాగే ఉంటుందని సంక్షేమ అభివృద్ధి ప్రజలు మర్చిపోరని అన్నారు, జనవరి ఒకటో తేదీ నుంచి వృద్ధాప్య పెన్షన్ 3 వేలు అందిస్తామని తెలిపారు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఏదైతే చెప్పారో తూచా తప్పకుండా అన్ని అమలు చేసి అదనంగా అనేక పథకాలు అందిస్తున్నారని ఆరోగ్యశ్రీకి 25 లక్షలు పెంచడం పేద ప్రజలకు ఎంతో మేలని అనేకమంది ముఖ్యమంత్రిని కొనియాడుతున్నారని అన్నారు .

క్రీడల్లో స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

నర్సాపురం రూరల్,మేజర్‌న్యూస్:తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కాలేజీలో ఈనెల 19 నుండి 21వ తేదీ వరకు నిర్వహించిన అంతర పాలిటెక్నిక్ కళాశాల క్రీడల్లో సీతారాంపురం స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ విద్యార్థులు పలు పోటీల్లో విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో చెస్ విభాగంలో టి. సృజన కృపాసాగరిక ప్రథమ స్థానం. బ్యాట్మెంటన్ (షటిల్) విభాగంలో బొమ్మిడి వర్షినిప్రథమ స్థానం, డబుల్ విభాగంలో బొమ్మిడి వర్షిని,జి నాగేశ్వరి అమృత, ద్వితీయ స్థానం,బాలురు విభాగంలో లాంగ్ జంప్ విభాగంలో సిర్ర వెంకట కుమార్ ప్రథమ స్థానం, ట్రిపుల్ జంప్ తృతీయ స్థానం, డిస్కస్ త్రో విభాగంలో ఆర్ ఉమా లోకేష్ నాయుడు తృతీయ స్థానం జావలిన్‌త్రోవిభాగంలో ద్వితీయ స్థానం సాధించారు.ఈ విద్యార్థులు జనవరి 4,5,6 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనుటకు అర్హత సాధించారు.వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులనుశుక్రవారం జరిగిన కార్యక్రమంలోకళాశాల చైర్మన్ కెవి సత్యనారాయణ, కోశాధికారి కెవి స్వామి,పాలకవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి,ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సురేష్ కుమార్, స్వర్ణాంధ్ర ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పండరినాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అలక గోపీచంద్,స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్. ఎస్. కిరణ్మయి, ఫిజికల్ డైరెక్టర్ మూర్తి విద్యార్థులను అభినందించారు.

డిమాండ్లన్నీ నెరవేర్చే వరకు ఉద్యమం ఆగదు

ముదినేపల్లి ,మేజర్‌న్యూస్ : న్యాయమైన సమస్యలు పరిష్కారం అమలు చేసే వరకు ఉద్యమం ఆగదని అంగన్వాడి కార్యకర్తలు సమ్మెలో నినాదాలు చేశారు. ముదినేపల్లి తహసిల్దార్ కార్యాలయ సమీపంలో అంగనవాడిల సమ్మె 11వ రోజు కొనసాగుతుంది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చిన్నం మాధవరావు మాట్లాడుతూ సమ్మె సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకుండా మూడుడిమాండ్లు కంటితుడుపుగా పరిష్కరించి చేతులు దులుపుకుందన్నారు.ఇదేవిధంగా ప్రభుత్వం మొండివైఖరిని అవలంబిస్తే సమ్మేను ఉధృతం చేస్తామన్నారు.అంగనవాడి కార్యకర్తలు శిబిరం నుండి ప్రధాన రహదారిపైర్యాలీగా బయలుదేరి ముదినేపల్లి వై జంక్షన్ వద్ద కొద్దిసేపు రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో సొంగ మణి , సూరపనేని అరుణ , రిబ్కా , పద్మ , హైమావతి,రమణి,సుప్రభాత ,జ్యోతి,భాగ్యలక్ష్మి తదితర అంగనవాడి కార్యకర్తలు , సహాయకులు పాల్గొన్నారు.

దాతల దాతృత్వం మరువలేనిది -ముత్యాల శ్రీనివాస్

మానవతా ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధిత పిల్లలకు దుస్తులు పంపిణీ

పాలకొల్లు, మేజర్ న్యూస్: మానవతా ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలకు దాతల దాతృత్వం మరువలేనిదని మానవతా సంస్థ అధ్యక్షుడుముత్యాల శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు పట్టణ కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్లో మానవతా ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా హెచ్ఐవి బాధిత పిల్లలకు నూతన వస్త్రాలను పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవతా ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధిత పిల్లలకుప్రతినెలాపౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. క్రిస్మస్‌పండగసందర్భంగా 30 మంది పిల్లలకు, సంరక్షకులకు తణుకు మండలం వేల్పూరు కి చెందిన బోళ్ల రామలక్ష్మి, చుండ్రు సీతమ్మ, చుండ్రు కళ్యాణిల సుమారు 30 వేల రూపాయల ఆర్థిక సహాయంతో నూతన దుస్తులను అందజేసినందుకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. మానవతా సంస్థ ఆధ్వర్యంలో అనేక వైద్య సేవలతో పాటు పేద వర్గాలను ఆదుకునే కార్యక్రమాలను చేపడుతున్నామని శ్రీనివాస్ తెలిపారు. దాతలు రామలక్ష్మి, సీతమ్మ,కళ్యాణి లు మంచి కార్యక్రమంలో భాగస్వామ్యం చేసినందుకు మానవతా సమస్థకు కృతజ్ఞతలు తెలిపారు.దాతలుదుస్తులతో పాటు స్వీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ శాలువా కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో సమస్థ కన్వీనర్ ముత్యాల రామారావు, కార్యదర్శి పేరిచర్ల ప్రతాప్ రాజు, కోశాధికారి మద్దాల వాసు, సభ్యులు ధనాన్ని సూర్య ప్రకాష్, బొక్క గంగాధర్ రావు, బోళ్ల శ్రీనివాసరావు,విన్నకోట వెంకటరమణ, తమ్మినీడి మురళీకృష్ణ, ముత్యాల ప్రదీప్, సంరక్షకురాలు రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

చిన్న తాడేపల్లి చైతన్యలో గణిత దినోత్సవ వేడుకలు

తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్: డిసెంబర్ 22 శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక చినతాడేపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యొక్క గణిత ఉపాధ్యాయులు విద్యార్థులందరికీ వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, గణిత ఎక్స్పో వంటి వివిధ రకాల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానములలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రసాద్ బహుమతులు ప్రధానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రసాద్ మాట్లాడుతూ గణిత శాస్త్రములో అత్యున్నత ఘనతను సాధించిన శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు వేడుకను ప్రతి సంవత్సరం డిసెంబర్ 22వ తేదీన జరుపుకోవడం చాలా గొప్పగా భావించారు. గణితాని కి విశిష్ట సేవలు అందించిన రామానుజన్ ప్రయోగాలను మెలుకువలను విద్యార్థులకు తెలియజేశారు. గణిత ఉపాధ్యాయులు పాఠశాల డీన్ నాగార్జున విద్యార్థులకు 1729 యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులందరూ గణితము లో చక్కటి ప్రాముఖ్యత ను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు కిరణ్, నారాయణ, శ్రీనివాస్, వెంకట్రావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏజీఎం పార్థసారథి, రీజనల్ ఇంచార్జ్ ఉదయ్ భాస్కర్, కోఆర్డినేటర్ రామారావు ఉపాధ్యాయులకు , విద్యార్థులకు గణిత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

అనుష్క శెట్టి, నవీన్ పొలిశెట్టి జంటగా నటించిన మిస్ శెట్టి,మిస్టర్ పోలిశెట్టి వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ చూడండి

విలువైనబహుమతులుగెల్చుకోండి
ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు
మీ జీ తెలుగులో!

ఈస్ట్ గోదావరి, డిసెంబర్ 20: వారంవారం సరికొత్త సినిమాలను అందించే జీతెలుగు ఈ ఆదివారం మరో బ్లాక్‌బస్టర్‌సినిమాతో ప్రేక్షకులను అలరించేందకు సిద్ధమైంది. కామెడీఅండ్‌ఎమోషనల్ డ్రామాగా ప్రేక్షకులను మెప్పించిన మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమాను వరల్డ్ టెలివిజన్‌ప్రీమియర్గా అందించనుంది. టాలీవుడ్ స్వీటీ అనుష్క శెట్టి, టాలెంటెడ్ హీరోనవీన్ పొలిశెట్టి నటించిన మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి డిసెంబర్ 24, ఆదివారం సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో!

మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి కథ లండన్‌కు చెందిన మాస్టర్ చెఫ్ అయిన అన్వితా రవళి శెట్టి (అనుష్క శెట్టి పాత్ర) జీవితం చుట్టూ తిరుగుతుంది. పెళ్లి కాకుండానే తల్లి కావాలని నిశ్చయించుకుని, స్టాండప్ కమెడియన్ సిద్ధు పొలిశెట్టి (నవీన్ పోలిశెట్టి)ని తన బిడ్డకు తండ్రిగా ఎంచుకుంటుంది. అన్విత ఉద్దేశం తెలియని సిద్ధూ ఆమెతో ప్రేమలో పడతాడు. ఆమె ఉద్దేశాల గురించి తెలుసుకుని షాక్ అవుతాడు. సిద్ధూ అన్విత నిర్ణయానికి అంగీకరిస్తాడా? అన్విత ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణమేమిటి?అనేప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే.అన్విత ప్రయాణం తప్పకుండా అందరి హృదయాలను హత్తుకుంటుంది. అనుష్క శెట్టి, నవీన్ పొలిశెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో మురళీశర్మ, అభినవ్ గోమఠం, నాజర్, సోనియా దీప్తి, జయసుధ, తులసి, మహేష్‌ఆచంట, భద్రం తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. మహేష్ బాబు పి దర్శకత్వం,యూవీ క్రియేషన్స్ నిర్మాణంలోలో రూపొందిన ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులను మెప్పించింది. వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ప్రసారం కానున్న ఈ సినిమాను మీరూ మిస్సవకండి! వరల్డ్టెలివిజ న్ప్రీమియర్ను మరింత ఉత్సాహపరిచే విషయంఏమిటంటే, జీతెలుగులో సినిమా ప్రసారంసమయంలో, ఛానల్ఒక ఆకర్షణీ యమైన పోటీని నిర్వహిస్తోంది. సినిమా ప్రసారం అంతటా ప్రేక్షకులు ఐదు ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిఉంటుంది .ఈకాంటెస్టోపాల్గొనేం దుకు వీక్షకులుక్యూఆర్కోడ్నుస్కాన్చేయవచ్చు లేదా ఇచ్చిననంబర్కు మిస్డ్కాల్ఇవ్వవచ్చు. ప్రతిప్రశ్న తరువాత లక్కీ విజేతలకు అద్భుతమైన బహుమతులు అందజేస్తారు.మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఈ ఆదివారం సాయంత్రం 6గంటలకు జీ తెలుగులో మాత్రమే, తప్పక చూడండి!

పెదవేగిలో రాస్తా రోకో చేసిన అంగన్వాడీలు

పెదవేగి, మేజర్‌న్యూస్: గౌవర వేతనం మాకొద్దు, కనీస వేతనమే ముద్దు అంటూ అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 11వ రోజు శుక్రవారం కొనసాగింది. మండల కేంద్రం పెదవేగిలో తహసీల్దారు కార్యాలయం ఎదుట రహదారిపై రాస్తారోకో చేసిన తమ నిరసన వ్యక్త చేశారు. గౌరవ వేతనం అంటూ ప్రభుత్వం మాతో వెట్టి చాకిరీ చేయిస్తోందని, కనీస వేతనం ఇచ్చి, మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు జే. గోపి, పి.ప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీలు 11రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిం చడం శోచనీయమన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నమ్మె చేస్తున్న అంగన్వాడీలను తిన్నది అరగక సమ్మె చేస్తున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ అనడం ఆయన విజ్ఞతే వదిలేస్తున్నామని వారు పేర్కొన్నారు. జగన్ పాదయాత్ర సందర్భంగా తెలంగాణకు మించి రూ.వెయ్యి ఇస్తామని చెప్పిన మాట వాస్తవం కాదా అని వారు ప్రశ్నించారు. అంగన్వాడీలవి గొంతెమ్మ కోర్కెలుకాదని,వారికష్టానికితగినప్రతిఫలమే అడుగుతున్నారని వారు వివరించారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించేవరకు సమ్మె ఆగదని, సమస్యలను సాధించుకునే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు బేబిరాణి, కృష్ణవేణి, సూర్యకుమారి, భార్గవి, త్రివేణి, సుజాత, యశోద, దుర్గ, శ్రావణి. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస వ్రత ఉత్సవాలు

పాలకొల్లు,మేజర్‌న్యూస్: శ్రీఅష్టభుజలక్ష్మీనారాయణస్వామి వారి దేవస్థానం లో ధనుర్మాస వ్రత ఉత్సవములు వైభవముగా జరుగుతున్నాయి.ఆరవరోజు అర్చకులు శ్రీమాన్ కరి పవన్ స్వామి , శ్రీస్వామివారిని శ్రీపార్థసారథిగా అలంకరించారు. శీగోదాఅమ్మవారు ఆలపించిన తిరుప్పావై పాశుర విశేషములను శ్రీమాన్ పి రంగనాథ స్వామి వారు భక్తులకు తెలియజేశారు.దీనిలో చైర్మన్ జవ్వాజి పానకాలు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఈఓ పిటి గోవిందరావు లు పాల్గొన్నారు.ధనుర్మాస కమిటీ సభ్యులు మామిడి వెంకటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు చేశారు.

అగ్నిప్రమాద బాధితులకు విజన్ లయన్స్ క్లబ్ సహాయం

పెదవేగి, మేజర్‌న్యూస్: సర్వం కోల్పోయి సాయం కోసం ఎదురుచూస్తున్న ఆపన్నులను ఆదుకోవడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్.అవినాష్రజు అన్నారు. పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ గుమ్మడిగుంట దగ్గర రెండురోజుల కిందట జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో చెట్టుకింద తలదాచుకున్న బాధిత కుటుంబం గొటుకుల పార్థసారది. ఉష కుటుంబ సభ్యులను ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు, దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్తో కలిసి పరామర్శించి, వారికి 50కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, పళ్ళాలతోపాటు ఆర్థిక సాయం అందించి, వితరణ చాటారు. ఈ సందర్భంగా ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సాయం చేయడం దేవుడు మనకిచ్చిన గొప్ప అవకాశమన్నారు. సాయం చేసే గుణం మనల్ని మరింత ఉన్నత దిశగా నడిపిస్తుందని ఆయన చెప్పారు. సర్వం కోల్పోయి చెట్లనీడన ఉంటున్న పార్థసారథి కుటుంబాన్ని అదుకోవడానికి ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు శేషుకుమార్. మల్లిఖార్జునరావు, నాగభూషణం, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.